# కృతజ్ఞత ★ శ్రీ కె. లింగరాజుగారు

వెనక్కి తిరిగిచూచిన సుందరి కళ్ళల్లోకి ఓసారిచూచే. అందులో క్రూరత్వం, ద్వేషం, కోపం, ఒలికి నిండుకున్నాయి. చూస్తుండగానే చేతిలో ఉన్న గిన్నెలను మరింత చప్పుడుచేస్తూ క్రిందపడేసింది.

నాకు నవ్వువచ్చింది. 'సుందరీ! ఇవ్వాళ మంచి సినీమా వుంది" అన్నా కొరకొరా చూసింది. "సినీమా క్రిందేవుంది నావని."

'ఏం వచ్చిందేమిటి!' కళ్ళతోటే అడిగా. నాకు తెలుసు సినిమా అంటే సుందరి కోపం ఎక్కడిదక్కడ మాయమైపోతుందని. అటు పిల్లని, ఇటు ఇంట్లో పనిచేసుకోలేక కస్సు, బుస్సులు ఎక్కువై పైకి చిమ్ముతున్నై.

'అయితే బాబుని మీ నాన్నగారిదగ్గర ఒదిలి రమ్మంటారా?'

'ఊ'

"నాకిష్టంలేదు. ఆయనా ముసలివాడైపోయేడు. దృష్టి మాంద్యంకూడా వచ్చింది. తనకు కావలిసిందేమో తనే తెలుసుకోలేకుండా వున్నాడు. పైగా బాబుని.. "

సుందరి చెప్పేవిషయం నిజమే. అయినా అంత మరీ లేవలేని స్థితిలో లేడుగా ఆయన అంటుంది ఆత్మ. "ఫరావా లేదు. అంతగా ఏడుస్తే ప్రక్కవాటాలోవున్న వాళ్ళు సముదాయిస్తారులే..."

సగంలోనే అందుకుని "సముదాయిస్తారు! వాళ్ళ పిల్లల్తో వాళ్ళే వేగలేకుండావుంటే ఇద్దరు జమాన్లుని పెట్టుకున్నారు. ఆఁ మర్చిపోయే. వాళ్ళ చిన్నబ్బాయికి, మన బాబుకంటె ఆర్నెల్లు చిన్న, ఎంత చక్కటి ఉయ్యాలా చేయించేరనుకున్నారు. ఇవ్వాళ వస్తుందట .."

ఎందుకు ఇది చెప్పిందో నాకు తెలుసు. అంతగా ఎందుకు బాధపడుతోందో కారణంకూడా అర్థంకానిదికాదు. నా మట్టుకు నాకు వచ్చేజీతం, భోజనం, ఇంటి అద్దెకు సరిపోతోంది. అసలు బాబు పుట్టినప్పటినుండి పండుగే చేసుకోలేదు. ముచ్చట్లు తీర్చనేలేదు. లోపల సుందరికి గడపదాటితేను, చోల్లుకారుస్తేను, ఇల్లాంటివాట్లకి ఏదో అందర్నిపిల్చి ముచ్చట చేయిద్దామని వుండేది.

సహజంగా తల్లిదండ్రుల తీపి అల్లా అనిపిస్తుంది. అయినా నాకూ బాధగానేవుండేది. బీదరికం అన్న వాతావరణంలో ధనికత్వపు వూహాలు ఎందుకు కమ్ముకుంటాయా అని. బాబు అంతవరకూ గుడ్డ వుయ్యాల్లోనే.

"ఎప్పటికైనా మనమూ" ఇక మాట్లాడ లేకపోయాను. లోపల బాధగుండెల్ని నుములుతోంది.

"ముసలాళ్ళమైన తర్వాతనా? జరగవలసిన కాలంలో అన్నీ జరిగితే అందంగా వుంటుంది. అయినా ఇప్పుడు మనము చేయించుకోగలం. ఆర్నెల్లలోపులో చక్కటి మంచం తయారైపోతుంది. మీకు ధైర్యంలేదు కాని."

నాకు అర్థంకాలేదు. ధైర్యం, అధైర్యంల సమస్య ఎక్కడ, ఏ విషయంలో సంఘటిల్లిందో బోధపడలేదు. ఆలోచించడం మొదలుపెడితే అంతులేనట్టే వుంది.

"అవును, మీ నాన్నగార్ని సావిట్లో ఆ మంచంమీద పడుకోమనకూడదూ? ఈరోజుల్లో ఇళ్ళదొరక్క చస్తున్నారాయె. అగది ఒకటి అద్దెకిస్తే కనీసం నెలకి పదిహేను వస్తుంది. ఆర్నెల్లలో . "

"ఎల్లా .'" పూర్తికాకమునుపు అందుకుని "మీరు ఎల్లాగా చెప్పరు. ఆయనకి చెప్పనూలేరు. ఆయన ఎంత చెపితే అంతే! ఓరోజు ఆఖరుక్కి ఏలాంతరో తిరగదోసి ఇల్లు కూడా మంటపెడతారేమో."

"ఎందుకు సుందరీ? అంతగా ఆయన్ని న్యూనత పరుస్తావ్? ఆయనపని ఆయన చేసుకోవటం లేదా?"

"ఓ? మహాబాగా చేసుకుంటున్నారు. కాల్చిన చుట్ట పీకలు ఎత్తి పారపొయ్యలేక నడుం పడిపోతోంది. ఆ గది

GOUTAMI LIBRARY
RAJAHMUNDRY

గోడలనిండా ఉమ్మిలే. వాళ్ళిల్లుచూడండి. ఎప్పుడూ ఎంత శుభ్రంగావుంటుందో! ఎంత చక్కగా అమర్చివుంటుందో! శుభ్రంగా గాలివేస్తుంది. నిశ్శబ్దంగావుంటుంది. ఇంక మన ఇల్లో అయ్యవార్లంగారి .." కంఠం రుద్ధమై మాట్లాడ లేకపోయింది. పమిటిచెంగు కళ్ళకి అద్దుకుంది.

నామట్టుకు నాకు ఏంచెయ్యాలో పాలు పోవటంలేదు. కళ్ళప్పగించి కొంతవరకూ చూచేను. ఆ నిట్టూర్పులు ఊగు తూనే వున్నాయి.

"సుందరీ! పిచ్చి ఎత్తిందా ఏమిటి! ఉండు! ఈ క్షణంలోనేవెళ్ళి నాన్నతో చెపుతా! సావిట్లో మీరు మంచం వేసుకోండి అని..."

ఆగకుండా పడమటింట్లో పిల్లి పాలుత్రాగుతున్నా, కొట్టకుండానే నాన్న గదిదగ్గరికివచ్చే. నాన్నా!

ఆయన రోజూ కూర్చుండే కుర్చీలోనే కూర్చుని కిటికీ లోంచి వచ్చేగాలిని లెఖ్ఖపెడుతున్నట్టుగానే వున్నారు. బాబు ఆయన కాళ్ళమీద ఆనుకు నుంచుని, బొమ్మల కాగి తాన్ని చింపుతూ కేకలువేస్తున్నాడు. కాల్చే చుట్టపొగ మేఘాలు ఇటూఅటూ పరిగెత్తుతున్నాయి. నాన్న చెయ్యి బాబునడుంమీద కాపలాకాస్తుంటే, కళ్లు ఆనందంతో సంగీతం పాడుతున్నై?

తలుపు బార్లాతీసే. బాబు ఓసారి మెడ వెనక్కుతిప్పి నవ్వేడు. నాన్న తలెత్తి 'ఏం?' అన్నట్టే చూచేడు.

ఆచూపు నన్ను సందిగ్ధపరచి అచేతనుడిగా చేస్తోంది. నాన్న గతవత్సరంనుండి నాదగ్గరే వుంటున్నాడు. తాలూ కాఫీసు గుమాస్తాగాచేసి సంపాదించిన డబ్బంతా, అమ్మ జబ్బుకే అయిపోయింది. ఆవిడ వెళ్ళిపోవడంతోటే, నాన్న ఇల్లూ, వాకలికూడా లేనివాడైపోయేడు. ఆ దశలో ఏ కోమటి గుమాస్తా పని అయినా దొరుకుతుందేమో ప్రయత్నించేడు. అదికూడా అపురూపమై పోవడంతో చాలా బాధపడ్డాడు. ఆవణికే చేతుల్తో ఏమీ చెయ్యలేక, న్యూనతలోనే, నామీద ఆధారపడ్డాడు.

ఇటువైపు సుందరి.ఆరువత్సరాలనుండీ అర్థంచేసుకున్నా. ఆ పొట్టిగా, ఎర్రగా, గుండ్రంగావున్న ముఖంలోని ఆదరణ ఇంకా ఎంతవుందా అనుకుంటూ. నాతోపాటు నాకష్టాల్లో ఆదుకుంది. సమంగా తానూ భరించింది. బాబు ప్రపంచం లోకి వచ్చేవరకూ బీదరికం పీల్చేసింది. తర్వాత..

ఇప్పుడు బాబుకోరకు ఆమె అడగడంలో తప్పులేదు. మాతృస్థానం అల్లా అడిగిస్తుంది. అయినా ఈ సమయంలో నాన్నతో ఆసంగతి చెప్పలేకుండా నిరుత్సాహం కల్గుతోంది. ధైర్యం రావటంలేదు. ఎంచేతో?

గుమ్మంలో నుంచుని కిటికీవైపుచూచే. దొడ్లోవున్న బంతిపూలుతలలు ఆడిస్తున్నై. బాబు తాతకాళ్ళని చరుస్తు న్నాడు. 'తాత' 'తాత.' ఆ వచ్చీ రానిమాటలు పలు కుతూ ఆనందిస్తున్నాడు.

నాన్న లేచేడు. చేతుల్లోకి తీసుకుని బుగ్గకి, బుగ్గ ఆనిస్తూ మురిసిపోతూనే, నా దగ్గరగా వచ్చేడు. నాన్నకి బాబంటే ప్రాణం. ఆ గదిలో వాడితో కూర్చుని ఆకలీ, నిద్రాకూడా మర్చిపోతాడు. బాబుకి వాళ్లమ్మ అక్కరనే లేదు.

నాన్నా! పెదిమలు వణుకుతున్నై. 'ఏంకావాలి? ఏమైనా మాట్లాడాలనుకున్నావా" ఆయనికి ఎల్లా తెలి సిందో.

"లేదు . ఏమీలేదు .." ఆ మాటలు తడబడ్డాయి. నాలో నన్నే నాసందిగ్ధానికి ద్వేషించుకున్నా. అసమర్థత్వం తలవంపు చేస్తోంది.

వీధిలోబండి ఆగింది. ఏమిటో సామానుతోటి వున్నట్టే చప్పుడైంది. నాన్న బాబును ఎత్తుకుని వీధిలోకి వెళ్ళి పోయేడు.

కిటికీలోనుండి కనపడే బంతిపువ్వులు నవ్వుతున్నై. నుంచో లేక వెనక్కుతిరిగి వంటింట్లోకి వచ్చే.

సుందరి చురుగ్గా చూస్తూనే "మీరు చెప్పలేదన్న మాట .." అంతే అంది.